సడలని సంకల్పం

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో వృద్ధులు, దివ్యాంగులు చూపుతున్న తెగువ నేటి యువతకు ఎంతో ఆదర్శనీయం. ఐదేళ్ల పాటు తమకు మంచి చేసిన అభిమాన నేతను గెలిపించుకునేందుకు సడలని సంకల్పంతో వచ్చి ఓటు వేశారు.



ఇందుకూరుపేట : వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తీసుకెళ్తూ..



వెంకటాచలం : ఇడిమేపల్లిలో దివ్యాంగుడిని తీసుకెళ్తూ..



పొదలకూరు : చెన్నారెడ్డిపల్లిలో వీల్‌చైర్‌పై వృద్ధురాలిని తీసుకెళ్తూ..



మనుబోలు: నడవలేని వృద్ధురాలిని ఓటింగ్‌కు తీసుకెళ్తూ..



కొడవలూరు: గౌతమ్‌నగర్‌లో వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

ఊరూ వాడా.. ఓటెత్తిన చైతన్యం

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. మహిళలు, వృద్ధులు, యువకులు ఎండను సైతం లెక్కచేయకుండా క్యూలో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకుని చైతన్యం చాటారు. రెండు నియోజకవర్గాల్లో దాదాపు 75 శాతం కంటే అధిక పోలింగ్ నమోదు కావడం విశేషం. చిన్నచిన్న గొడవలు మినహా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

సర్వేపల్లిలో ప్రశాంతం



పొదలకూరులో బారులు తీరిన ఓటర్లు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, వెంకటాచలం, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు, మనుబోలు మండలాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండగా ఓటర్లు 6:30 గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలో నిలబడ్డారు. మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు అన్ని మండలాల్లో తోపులాటలు, కేకలు తప్పించి మొత్తమ్మీద ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. కొన్ని గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల పోలింగ్ కొద్దిసేపు నిలిచిపోయింది. మరికొన్ని గ్రామాల్లో మాక్‌పోలింగ్ పూర్తయిన తర్వాత అరగంట పాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పొదలకూరు మండలం బిరదవోలు, చెన్నారెడ్డిపల్లి, మనుబోలు మండలం కొలనుకుదురు, వెంకన్నపాళెం, కొండూరుపాళెం గ్రామాల్లో పోలింగ్ రాత్రి 7.30 గంటల వరకు కూడా కొనసాగింది. వెంకటాచలం మండలం గుడ్లూరువారిపాళెంలో 235వ బూత్ వద్ద టీడీపీ నాయకుడు మురళీధర్‌రెడ్డి ఏజెంట్లతో గొడవకు దిగి నానా హంగామా చేయడంతో అధికారులు వెళ్లి సర్దుబాటు చేశారు. పొదలకూరు మండలం చెన్నారెడ్డిపల్లిలో సాయంత్రం 6 తర్వాత కూడా ఓట్లు వేసేందుకు ఓటర్లను లోపలికి పంపుతున్నారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు వెళ్లారు. అయితే స్లిప్పులు పంపిణీ చేసిన వారు క్యూలో ఉండడంతో వివాదం సద్దుమణిగింది. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పలు మండలాల్లో ఎన్నికల ప్రక్రియ రాత్రి 7:30 తరువాత కూడా కొనసాగడంతో నియోజకవర్గ పోలింగ్ పర్సంటైల్‌ను అధికారులు వెల్లడించలేదు. సాయంత్రం 5 గంటల వరకు మాత్రం 72.90 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు.

మందకొడి పోలింగ్‌తో ఓటర్ల బేజారు

పొదలకూరు : మండలంలో కొన్ని గ్రామాల్లో మందకొడిగా పోలింగ్ జరగడంతో ఓటర్లు బేజారు చెందారు. తాటిపర్తిలోని 13వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. బిరదవోలు, డేగపూడి, చెన్నారెడ్డిపల్లి, ముదిగేడు గ్రామాల్లో సాయంత్రం 8.30 గంటలకు పోలింగ్ జరిగింది. కనుపర్తిలో ఓటు వేసే విషయంలో తోపులాట జరిగి కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. ఈవీఎంలు మందకొడిగా ఉన్నాయని, తీవ్ర జాప్యం జరుగుతోందని రాజకీయ పార్టీల నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాటిపర్తి, విరువూరు, బిరదవోలు తదితర పెద్ద పంచాయతీల్లో మహిళా చైతన్య కనిపించింది.

పోలింగ్ సరళిని పరిశీలించిన కాకాణి

ముత్తుకూరు : ముత్తుకూరు జెడ్పీహైస్కూల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని సర్వేపల్లి అభ్యర్థి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. నాయకులు, కార్యకర్తల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయాన్నే మహిళలు పోలింగ్ కేంద్రాలకు వచ్చి బారులు తీరారు.

తోడేరులో ఓటువేసిన కాకాణి

పొదలకూరు : మండలంలోని తోడేరు గ్రామంలో సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి విజిత, కుమార్తెలు పూజిత, సుచిత్ర ఓటు వేశారు.

మండలంలో 80 శాతం పోలింగ్

మనుబోలు : మండలంలో చెదురు మదురు ఘటనలు మినహా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం మీద సుమారు 80 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి తెలిపారు. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 42 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన మనుబోలులో గరిష్టంగా పది పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. వేసవి భయంతో ఉదయం 7 గంటలకే భారీగా ఓటర్లు పోలింగ్ స్టేషన్‌ల వద్ద బారులు తీరారు. పండు వృద్ధులు, నడవలేని వారిని సైతం వివిధ పార్టీల కార్యకర్తలు వీల్‌చైర్లలో తీసుకొచ్చి ఓటు వేయించారు. పలు గ్రామాల్లో భారీ ఓటింగ్ జరిగింది. కొన్ని గ్రామాల్లో కొద్దిసేపు వీవీప్యాట్‌లు మొరాయించడంతో ఓటింగ్ ఆలస్యమైంది. మనుబోలు అరుంధతీయవాడ, కొలనకుదురు, కొండుపాళెం, చెర్లోపల్లి, వెంకన్నపాళెం గ్రామాల్లో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు. అలాగే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మనుబోలు, కొమ్మలపూడి, గురివిందపూడి పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు.



కంటేపల్లిలో ఎండలో ఓట్లు వేసేందుకు నిలబడిన మహిళలు



పొదలకూరు : బిరదవోలులో బారులు తీరిన మహిళలు



మనుబోలు హైస్కూల్ వద్ద స్థానిక నేతలతో ఎంపీ గురుమూర్తి



మనుబోలు: పిడూరులో బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ సరళి ఇలా..

సమయం	పోలింగ్ శాతం
ఉదయం 9 గంటలు	11.04
ఉదయం 11 గంటలు	24.30
మధ్యాహ్నం ఒంటిగంట	42.20
మధ్యాహ్నం 3 గంటలు	61.90
సాయంత్రం 5 గంటలు	72.09
మొత్తం	83.39



ముత్తుకూరు : పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మంత్రి కాకాణి



ముత్తుకూరు : జెడ్పీహైస్కూల్లో..



మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు

కోవూరులో పోటెత్తిన జనం



ఇందుకూరుపేట : గంగపట్నంలో క్యూలో ఉన్న మహిళలు

కోవూరు : కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జనం పోటెత్తి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా వచ్చి ఓటు వేశారు. కొన్నిచోట్ల టీడీపీ నేతలు దౌర్జన్యకాండకు దిగినా అన్ని ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగింది. కొన్ని గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల పోలింగ్ కొద్దిసేపు నిలిచిపోయింది.

ఎంపీ, ఎమ్మెల్యేల పరిశీలన

మండల పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పరిశీలించారు. కోవూరు మండలం చుండుగుంటలో సాయంత్రం 7.30 గంటల సమయంలో పోలింగ్ జరుగుతుండగా ఎంపీ విజయసాయిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు మద్దతుగా నిలిచారన్నారు. ఆయన వెంట డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ నేతలు చిరంజీవి, మందా రవికుమార్, సాయి అశోక్‌రెడ్డి, కవరగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో..

మండల పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. గతంలో ఎప్పుడు లేని విధంగా ఓటర్లు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రక్రియను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్ రెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా..

కొడవలూరు: కొడవలూరు మండలంలో పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రమైన కొడవలూరులో 75 శాతం ఓట్లు పోలయ్యాయి. పెరిగిన పోలింగ్ శాతం అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూలించవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వికలాంగులు, కురు వృద్ధులకు ప్రస్తుతం ఇంటి వద్దనే పింఛన్ అందిస్తుండడంతో ఆ అవకాశం కోల్పోతామన్న ఆందోళనతో కుటుంబ సభ్యుల సాయంతో ట్రై సైకిల్‌లో వచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

- నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, కళ్యాణి దంపతులు వారి కుమార్తె చరణితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించబోతోందని ధీమా వ్యక్తం చేశారు.



ఇందుకూరుపేట : గంగపట్నంలో బారులు తీరిన ఓటర్లు



ఇందుకూరుపేట : గంగపట్నంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ఉదయం 6 నుంచే..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 6 నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. క్యూలైన్లలో బారులు తీరారు. వేసవి దృష్ట్యా ఉదయం పది గంటల్లోపే ఎక్కువ శాతం మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు మొగ్గు చూపారు. సాయంత్రం 3 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల్లో రద్దీ కనిపించింది. ఇస్కపాళెం పంచాయతీ వడ్డిపాళెంలో ఈవీఎం మొరాయించడంతో గంట పాటు పోలింగ్ నిలిచింది. కొన్ని కేంద్రాల్లో రాత్రి 8 వరకు పోలింగ్ జరిగింది. పలుచోట్ల టీడీపీ కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేసేందుకు యత్నించారు. చిన్న చిన్న ఘటనలు తప్ప మొత్తంగా పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది.

పోలింగ్ సరళి ఇలా..

సమయం	పోలింగ్ శాతం
ఉదయం 9 గంటలు	16
ఉదయం 11 గంటలు	28.81
మధ్యాహ్నం ఒంటిగంట	47.08
మధ్యాహ్నం 3 గంటలు	55.49
సాయంత్రం 5 గంటలు	73.59
మొత్తం	78.07



కొడవలూరు: నార్తురాజుపాళెంలో ఓటు వేసిన చలపతిరావు కుటుంబం



కొడవలూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కాగులపాడులో ఓటు వేసిన యువత

టీడీపీ కుట్రలు

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభావిత గ్రామాల్లో పోలింగ్ సరళిని చూసి టీడీపీ నేతలు ఓటింగ్ సక్రమంగా జరగకుండా కుట్రలు పన్నారు. టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి రాద్ధాంతం చేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడ్డారు. వెంకటాచలం మండలంలోని గుడ్లూరువారిపాళెం, వెంకటాచలం, సర్వేపల్లి, ఈదగాలి, అనికేపల్లి గ్రామాల్లో పోలీసుల సాక్షిగా వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు దాడులకు దిగారు. గుడ్లూరువారిపాళెం పంచాయతీ పరిధిలోని 239 పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకుడు మురళీధర్‌రెడ్డి నానా హంగామా సృష్టించాడు. పోలింగ్ సక్రమంగా జరగకుండా చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. పోలింగ్ సిబ్బంది కూడా టీడీపీ నాయకులకే అనుకూలంగా వ్యవహరించడంతో టీడీపీ నేతలు బరితెగించి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు ప్రయత్నించారు. పోలింగ్ సిబ్బంది కూడా టీడీపీ నాయకులకు వత్తాసుపలికేలా వ్యవరించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన మండలంలోని గుడ్లూరువారిపాళెం, పుంజులూరుపాడు, నిడిగుంటపాళెం, ఈదగాలి తదితర గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా పోలింగ్ సిబ్బంది, పోలీసులు వ్యవహరించాలని సూచించారు. టీడీపీ నాయకులు దౌర్జన్యాలు, దాడులకు దిగుతుంటే పోలింగ్ సిబ్బంది వారికే మద్దతుగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. విధుల్లో పక్షపాతం చూపే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెంకటాచలంలో..

మండల పరిధిలో మొత్తం 53,218 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 70 శాతానికి పైగా ఓటు నమోదైంది. మండలంలోని అనికేపల్లి, ఎగువమిట్ట, పూడిపర్తి, తిక్కవరప్పాడు, నిడిగుంటపాళెం, ఇడిమేపల్లి, కసుమూరు, చవటపాళెం, గొలగమూడి, కంటేపల్లి, సర్వేపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మండలంలోని సర్వేపల్లి, గుడ్లూరువారిపాళెం, వెంకటాచలం, అనికేపల్లి గ్రామాల్లో ఈదఫా ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతుందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులను పదేపదే రెచ్చగొడుతూ పోలింగ్ సక్రమంగా జరగకుండా కుట్రలు చేశారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలను వైఎస్సార్‌సీపీ నాయకులు సహించలేక వాగ్వాదానికి దిగడంతో టీడీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారు. టీడీపీ నాయకుల దాడులతో గుడ్లూరువారిపాళెం, వెంకటాచలం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి.



అనికేపల్లిలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య వాగ్వాదం

విద్యుత్ సిబ్బందికి ఎస్ఈ అభినందనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించిన అధికారులు, విధులు నిర్వహించిన సిబ్బందికి ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అభినందనలు తెలిపారు. సోమవారం విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో వందల సంఖ్యలో సిబ్బందిని నియమించి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కౌంటింగ్ జరిగే జూన్ 4వ తేదీ వరకు స్ట్రాంగ్ రూంల వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

పోలింగ్ సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారన్నారు.

పార్టీ శ్రేణుల్లో విజయోత్సాహం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కనిపిస్తున్న విజయోత్సాహం ఫలితాలకు ముందే తేటతెల్లమవుతోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం, కొడవలూరులో సార్వత్రిక ఎన్నికల సరళిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొడవలూరులో మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ వద్ద పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సుకతతో పని చేస్తున్నారని చెప్పారు. పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం పార్టీ విజయానికి ఎంతో దోహదపడనుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేతలు తిరుపతమ్మ, రవి, చిన్నా, మురళి, ఎస్. నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పోలీసుల తీరుపై అసహనం



ఎస్పీతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు సిటీ: పోలీసుల తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కొండాయపాళెంలో గల పోలింగ్ బూత్ వద్ద పోలీసులు సరైన భద్రత కల్పించలేదని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు తగినంత భద్రత కల్పించకపోతే తమ సేవాదళ్ సభ్యులు వచ్చి సేవలందిస్తారని ఆయన తెలిపారు. సరిపడేంత సిబ్బంది లేరని పోలీస్ ఉన్నతాధికారులు అంగీకరించారు. ఘటన స్థలానికి ఎస్పీ చేరుకొని మాట్లాడారు.

టీడీపీ నేతల దౌర్జన్యకాండ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసి గాయపరిచారు. గ్రామంలో 63వ పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన ముంగర శివకుమార్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. టిఫిన్ చేసి బూత్ లోపలికి వెళ్లే సమయంలో అక్కడున్న టీడీపీ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య శివకుమార్‌ను అడ్డగించి బెదిరింపులకు దిగాడు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమని.. నీ అంతు చూస్తానని దుర్భాషలాడారు. అక్కడే ఉన్న మరికొందరు టీడీపీ కార్యకర్తలు ప్రణీత్, ప్రసాద్, పవన్, హరనాథ్(రౌడీషటర్) ఒక్కసారిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. నేలపైతోసి గాయపరిచారు. అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సురేష్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు కందికట్టు మీనా తదితరులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ హైమారావు అక్కడికి చేరుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడారు.

ఎమ్మెల్యే అభ్యర్థిపై దురుసు ప్రవర్తన

కోవూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జొన్నవాడలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లగా టీడీపీ సర్పంచ్ పెంచలయ్య ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఏం అధికారం ఉందని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లావంటూ ప్రసన్నను ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యే అభ్యర్థినని పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చానని చెబుతున్నా వినకుండా పట్టించుకోకుండా దురుసుగా ప్రవర్తించారు.

వైఎస్సార్‌సీపీ భారీ విజయం ఖాయం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ భారీ విజయం ఖాయమని, మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పోలింగ్ సరళిని మంత్రి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొదలకూరు పట్టణంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లిలో 75 శాతానికిపైగా పోలింగ్ జరిగినట్లు సమాచారం ఉందన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే కంటే ఎక్కువ మెజారిటీ తనకు లభిస్తుందన్నారు. టీడీపీ అభ్యర్థి ఢీలాపడిపోయాడని, కొన్నిచోట్ల గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే అభ్యర్థినే తరుముకున్నట్లు చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పది స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టినా గొడవలకు దిగకుండా ప్రశాంత వాతావరణం మధ్య ఎన్నికలు జరిపించారని తెలిపారు. మంత్రి వెంట పార్టీ నాయకులు కోనం చినబ్రహ్మయ్య, వూకోటి లక్ష్మీనారాయణ, తుమ్మల శ్రీనివాసులు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శివశంకర్, తుమ్మల ప్రసాద్, బీపీ నారాయణరెడ్డి, డి.విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.